వలపు గుడ్డిదన్నారు...

కాని వలపు లక్షాధికారి కూతుర్నై పుడితే?

# జానకీ విలాసం

(కథానిక)

మోహనరావు నూతిదగ్గర పచార్లు చెయ్యడం చూసింది జానకి. గబగబా మెట్లు దిగి దొడ్లోకి వెళ్ళింది. చప్పుడు కాకుండా మెల్లిగా మోహనరావుకి రెండుమూడు గజాల దూరంలో ఉన్న మల్లె పొదచాటునుంచి కనిపెడ్తోంది ఏం చేస్తాడా అని. నూతిచుట్టూ ప్రదక్షిణం చేసి నూతిలోకి చూస్తూ నిలబడి పోయాడు ఏదో ఆలోచిస్తున్న వాడిలాగ. మెల్లిగా వెనకాలే వెళ్ళి నిలబడింది.

మోహన్ ఆ వేళతో జీవితం చాలిద్దామనుకొన్నాడు. ఇంటిలో తల్లి తప్ప ఎవరూ లేరు. తండ్రి సంపాదించి పెట్టలేదు. చిన్నప్పుడు అనుకొనేవాడు తనుకూడా కథల్లో హీరోల్లాగ ఏదో డబ్బున్నవాళ్ళ కూతురుచేత ప్రేమించబడతాననీ, ఆమెను పెండ్లి చేసుకొని హాయిగా బ్రతకొచ్చనీ. కాని తన నింతవరకూ ప్రేమించగలదు అనే ధీమాతో చూడగల్గిందల్లా జానకి నొక్కత్తెనే. జానకి తండ్రిదగ్గర తన తండ్రి గుమాస్తాగా ఉండేవాడు. జానకి తండ్రీ దగ్గరదగ్గర లక్షాధికారి. తను యింకా చిల్లి గవ్వకూడా సంపాదించలేనివాడు. జానకి చూస్తే అటుయిటూ కాకుండా యే మాటా తేల్చదు. ఎప్పుడూ నవ్వుతూ హాస్యంచేస్తూ మాట్లాడుతుంది. కాని అసలు విషయం ఎత్తడానికి ధైర్యంలేదు మోహనరావుకి. ఐనా జానకి తనని ప్రేమిస్తే ఎలాగోలాగ తండ్రిని ఒప్పించగలదనుకొన్నాడు. కాని జానకి తన్నెందుకు ప్రేమిస్తుంది? ఒకసారి జానకిపనిమనిషిద్వారాగులాబిపూలుపంపించాడు జానకికి. "అబ్బే! వడిలిపోయిన పూలెక్కడ పట్టుకొచ్చావే?" అని తన కర్ణపడేటట్టే కిటికీలోంచి పారపోసి కిటికీ తలుపులు గట్టిగా వేసింది తనకు వినపడేట్టుగా. అప్పట్నించీ జానకిని చూస్తే మరి కాస్త భయం మోహన్‌కి. ఆ తర్వాతకూడా ఏమీ జరగనట్టుగా నవ్వుతూ కేరింతలుకొట్టూ ఎగతాళిచేస్తూ మాట్లాడుతోండేది. ఆఖరికి తెగించి ఒక చిన్నకాగితం రాసి పంపించాడు "నన్ను ప్రేమిస్తున్నావా?" అని. కాని దాని వెనకాలే 'అదంతా అనవసరం' అని వ్రాసి వెంటనే తిరిగి పంపించేసింది. అది జరిగి యిప్పటికి సరిగ్గా ఒక రోజయింది. ప్రొద్దున్నే తల్లితో కొంచెం పోట్లాట జరిగింది.

ఎవర్నో దగ్గర చుట్టాలమ్మాయిని పెళ్ళి చేసుకోమని తల్లీ, కాస్తోకూస్తో సరిపడా డబ్బు లేకపోతే పెళ్ళి చేసుకోనని తనూ... చేసుకోకపోతే యింట్లోంచి లేచిపోయి యే నుయ్యో గొయ్యో చూసుకుంటానంది తల్లి. విధిలేక పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకున్నాడు. కాని ఆ రాత్రే ఎలాగో ఓలాగ చచ్చిపోదామనే ఉద్దేశ్యంతో ఒప్పుకున్నట్టు నటించాడే కాని నిజంగా ఒప్పుకోవాలని లేదు. తల్లిని దొడ్లోకి పోనిచ్చి 'రేపటిదాకా నే బతికున్నప్పుడు చూద్దాం' అని తనలో తనే అనుకుంటున్నా ననుకొని గట్టిగా అనేసిన మాటలు తల్లికి వినపడలేదనే సంతోషించాడే గాని అప్పటిదాకా ఎవరో తలుపుదగ్గర నుంచుని విని వెళ్ళిపోయిన సంగతి తెల్సుకో లేకపోయాడు.

నూతిలో కనబడ్తోన్న తన మొఖంలోకి చూసుకొంటూ ఆలోచించడం మొదలు పెట్టాడు. తను నూతిలో దూకితే తన తల్లి ఏమౌతుంది? ఓసారి జానకి తండ్రి చెప్పలేదూ అమ్మ బ్రతికున్నంతకాలం ఆవిడ కేలోటూ రాకుండా చూస్తానని? పైగా జానక్కూడా

ఆవిడంటే యెంతో యిష్టం. ఒకవేళ తను లేక పోయినా ఆవిడకేం లోటులేకుండా చూస్తారు. తనలాంటివాడు పోతేనేం? కన్నకడుపు గనక కానీ పేడుస్తుంది. తర్వాత అంతా మామూలే.

ఒక్కసారిగా నూతిలో జానకి మొఖం కనబడ్డట్లయింది. వెంటనే వీపుమీద గాజుల చెయ్యి, మోహన్ అనే మాటలు ఒక్కసారిగా వినపడ్డాయ్. సిగ్గుతో మొహం దించేసు కొన్నాడు.

"ఆ! భలే ధైర్యస్తుడవే! నూతిలో ఉరక డాని కింతసేపు ఆలోచనా?"

రెండు నిముషాలదాకా మాట్లాడ లేక పోయాడు. తను నూతిలో దూకుతానని ఆమె కెలా తెల్సింది?

"నేనేం నూతిలో పడదల్చుకోలేదు. ఎవరు చెప్పారో కాని" అన్నాడు మొఖం అటుకేసి తిప్పుకొని.

"ఒకళ్లు చెప్పేదేమిటీ? పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగడం యెవరూ చూడరనుకొంటుం దిట. పాపం, ఐనా యిందాకటి పెళ్లిమాటలు వింటే యెంతటి శుద్ధ మొద్దావతారమైనా యిట్టే కనుక్కోగలదు అబ్బాయిగారు నూతి దగ్గర ఎందుకు పచార్లు చేస్తున్నాడో."

ఇప్పటికి తెల్సింది జానకికెల్లా తెల్సిందో. తనకి బతకడం యిష్టం లేకపోతే చచ్చిపోతాడు. మధ్య జానకెవరూ తన్నడ్డుపెట్టడానికి? అయినా ఆమెని దొంగతనంగా తనింట్లో జరిగేదంతా ఎవరు వినమన్నారు?

"ఆహా! నిన్నంత దొంగతనంగా ఎవరూ వినమన్లేదు. పాపం జాలిగుండె నీది, అపడాని కొచ్చావ్ కాబోసు" అన్నాడు, దీనికంతటికీ కారణం ఆమె తనని ప్రేమించకపోవడమే అన్నట్టు.

"ఒహో! పాపం. నిన్ను నేనేం ఆపదల్చుకోలేదు. నేనేమంత దొంగతనంగా వినసూ లేదు. నీతో ఓమాట చెప్పాలని వచ్చేసరికి యింట్లో ఏమిటో అరుచుకొంటున్నారు. తమరు పాపం లోపల అనుకొంటున్నానని అనుకొని గట్టిగా అనేసి చాలిక్కొరుకున్న మాటలు, వినపడకుండా చెవులు మూసుకొందా మనుకొన్నా వినపడ్డాయ్. వినపడ్డాక మరి నేనేం చెయ్యను? నే చెప్పా లనుకొన్న మాట యిప్పుడేనా చెప్పుదా మను కొని వచ్చేసరికి పాపం అయ్యగారిక్కడ నూతికి ప్రదక్షిణం చేస్తున్నారు."

"నాకు తెలుసు నువ్వేం చెప్తావో."

"తెలియదు."

"తెలుసు."

"తెలిస్తే మరి మర్యాదగా బయటికి రా. ఇల్లాంటి పిచ్చి పిచ్చి వేషాలు యింకెప్పుడూ వెయ్యకుండా ఉంటావా?"

"నేనిప్పుడేమీ పిచ్చివేషాలు వెయ్యటం లేదు. నువ్వు చెప్పే సలహా నాకేమీ అక్కర్లేదు."

. "నేనేమీ సలహా యివ్వడానికి రాలేదు. ఒక్కమాట చెప్దామని వచ్చాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను" పాట పాడినట్టుగా ఒక అక్షరం తర్వాత ఒక అక్షరమే రాగం తియ్యడం మొదలు పెట్టింది జానకి.

"జానకీ!" ఆశ్చర్యంగా అరిచాడు ఒక్కసారిగా.

"అవును. ఆమాట చెప్దామనే వచ్చాను. వచ్చినందుకు నామీద దొంగతనం కూడా కట్టావు కదా. ఇప్పుడు నీ యిష్టం. నేనెందు కిక్కడ అడ్డం" అని రెండడుగులేసింది ఇంటికేసి.

"జానకీ...ఆగు...నిజంగా నేనా...ఒట్టేయ్" అన్నాడు వెళ్ళి జానకి చెయ్యి కట్టుకొని.

"ఒట్టూ లేదు. సత్యం లేదు. ఒక షరతు. ఎప్పటికైనా సరే నువ్వు పెళ్లి చేసుకొంటానని మాటయిస్తే?"

"అలాగే అన్నానుగా. మరి మీనాన్న ఒప్పు కోవద్దూ?"

"అదంతా నీకెందుకూ? మాట్లాడకుండా యింటికి పో!" అని పరుగెత్తింది మేడమీదికి.

* * *

ఇంట్లోకి వెళ్ళగానే "అబ్బాయ్! నీకోసం రాఘవరావుగారు ఎందుకో కబురుపంపించార్రా. అర్జంటుగా రమ్మని? ఇప్పుడే వాళ్ళ జవాను వచ్చి చెప్పివెళ్ళాడు. ఎందుకో ఓసారి వెళ్ళి రా" అంది కామేశ్వరమ్మగారు.

"రాఘవరావు గారా? సరే!" అన్నాడు బయలుదేరుతూ. సరే అన్నాడే కాని గుండెలు దడదడా కొట్టుకోడం మొదలుపెట్టాయ్. ఇప్పు

డెందుకు పిలుస్తాడబ్బా? ఒకవేళ జానకిగాని అంతా చెప్పేసి ఉంటుందా? ఒకవేళ చెప్తే మాత్రం యిప్పుడు పిల్చిందెందుకూ? ఆయన ఒప్పుకుంటాడా? ఎలా ఒప్పుకుంటాడు కూతుర్ని తనలాంటి బడుద్ధాయి కిద్దామని. ఒప్పుకోకపోతే యిప్పుడు చీవాట్లు పెట్టడానికి పిల్చాడా? చీవాట్లతో సరిపోతుందా? ఒకవేళ వెళ్ళడం మానేస్తే మరి కాస్త గోలవదూ? ఎలాగోలాగ వెళ్లి చీవాట్లు తిని యీసారి జానకి కనపడ్డప్పుడు చెప్దా మనుకొంటూ వెళ్లాడు.

వెళ్ళగానే గుమ్మంలో జానకి నుంచొని ఉంది. "సరేగాని ఓమాట. బయటికొచ్చాక చెప్తావా నన్ను ప్రేమిస్తున్నావో లేదో? ' అంది నవ్వుతూ. అప్పుడే అనుకొన్నాడు ఆవేళ తన కేదో మూడిందని. ఇంకా ఏ సమాధానం చెప్ప కుండానే రాఘవరావుగారు లోపలికి పిల్చారు. లోపల గదిలో ఒక బల్లచుట్టూ మూడు కుర్చీలున్నాయ్. ఒక కుర్చీలో ఆయన కూర్చొన్నాడు. రెండవ కుర్చీ చూపిస్తూ అలా కూచో అన్నాడు గదమాయించినట్టుగా. "అమ్మాయ్! ఇలా దా" అన్నాడు. జానకి వచ్చి మూడో కుర్చీలో కూచొంది ముఖం కిటికీవేపు తిప్పేసుకొని.

కూర్చున్న రెండునిమిషాలలో నౌకరు మూడు కప్పుల్లో కాఫీ తెచ్చి బల్లమీదపెట్టి వెళ్ళి పోయాడు. కాఫీ చూడగానే మోహనరావుకి గుండెల్లో రైళ్ళపరుగెత్తడం మొదలుపెట్టాయి. అంతకు ముందొకసారి రాఘవరావుగారు మాట వరసకి చెప్పారు - తనేపని చేసినా కాఫీతో మొదలెడ్తానని, ఓసారి ఎవర్నో తన్నడానికి తీసుకవచ్చి కాఫీయిచ్చాక రంగంలోకి దిగాడనీ.

"తాగూ. అలా చూస్తావేం!" నిశ్చయమయి పోయింది. ఆవేళ రాఘవరావుగారి చేతుల్లో, జానకిముందు తనపళ్ళు హూనమై పోతుందని.

జానకి పమిటచెంగు అడ్డం పెట్టుకొని నవ్వు తోంది మూతిముడుచు కొంటూన్నట్టు నటిస్తూ.

కాఫీ కప్పులు తీసుకు పోడానికి వచ్చినపుడు "ఒరేయ్! కామేశ్వరమ్మ గారిని బండితీసుకు వెళ్ళి తీసుకురా" అని నౌకర్తో చెప్పేసరికి. మోహన్ గుండెలు రైలు వేగంలోంచి విమాన వేగంలోకి దిగాయ్. తన తల్లిముందే జరుగుతుంది కాబోసురా యీ గోలంతా అని.

మెల్లిగా మొదలు పెట్టారు రాఘవరావు గారు. "అయితే అబ్బాయ్! మీ నాన్నగారు నా దగ్గర ఎంతకాలం పనిచేశారో తెలుసా!" అన్నాడు. పళ్ళు హూనం చెయ్యడానికి పునాది వేస్తున్నాను సుమా అన్నట్టు కళ్ళజోడు లోంచి చూస్తూ. "అవునండి చాలాకాలం పని చేశారు" అన్నాడు ఎంతో నెమ్మదిగా.

"మే మెంత కలసి మెలిసుండేవాళ్ళమో తెలుసా? అప్పుడు మీ కుటుంబం మా కుటుంబం ఒకరింటిప్రక్క ఒకళ్ళుండే వాళ్ళం. మీ నాన్న గారు నాదగ్గర గుమాస్తాగా ఉండేవారన్నమాటే గాని మే మిద్దరం అన్నదమ్ముల్లాగ ఉండే వాళ్ళం." తన్నడానికి ఒక్కొక్క మెట్టే దగ్గర కొస్తూన్నట్టనిపించింది ఒక్కొక్కమాటే.

"ఊహూ ఊహూ" అనడం కంటె నోరు మెదపడానికి ధైర్యం చాలలేదు మోహన్‌కి.

"మా జానకీ నువ్వూ రెండుమూడు గంటలు తేడాగా పుట్టారు. ఒకే ఆస్పత్రిలో పుట్టారు." అలాంటప్పుడు నువ్వు జానకిని ప్రేమిస్తున్నావా అని అడగడం ఎంత సహించరాని అపరాధమో తెలుసా అన్నట్టు కళ్ళజోడు వెనకాలగుడ్లు ఒకసారి అటునుంచి యిటుకదిలాయ్.

"ఊహూ!"

"వింటున్నావా?" ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు దెబ్బలు తినడానికి టైం దగ్గర కొచ్చినట్టుగా.

"అయితే, ఆ ఆస్పత్రిలో ఓ తమాషా జరిగింది." తనదాకా ఖుసలుకొట్టుకొంటూవచ్చిన ప్రాముపాము తనకొక్కంచెం దూరంలో మలుపు తిరిగి పోయినట్టయింది.

"చాలా ముఖ్యమైంది. కాస్తనిబ్బరంగావిను"

"ఊఁ!"

ఉన్నట్టుండి ఒక్కసారిగా "జానకి నా కూతురు కాదు" అన్నాడు.

"ఆ...!" అన్నాడు కళ్ళుతేలేసి మోహన్.

"గాబరా పడకు. ఆ ఆసుపత్రిలో నర్సు చేసిందిట యిదంతా. దానితో అందిట మీఅమ్మ అంటే అసలు జానకి అమ్మన్నమాట, తనకి మగ పిల్లవాడు పుట్తే యిరవై రూపాయలిస్తానని.

నువ్వు పుట్టగానే మీ అమ్మకి అసలు స్పృహ రాలేదు రెండు మూడు గంటలదాకా. నువ్వు పుట్టిన రెండు గంటలకి జానకి పుట్టిందట. యీ సమయం చూసుకొని యిరవైరూపాయలకి ఆశపడి నిన్ను జానకి తల్లి దగ్గర. జానకిని నీ తల్లి దగ్గర పడుకో పెట్టిందట. నిజంగా మాకు ఆడపిల్లే పుట్టింది కాబోసు ననుకొన్నాం. యిదిగో యీ ఉత్తరం చూడు". అని యింగ్లీషులో టైపుచేసిన ఒక రెండు పేజీల ఉత్తరం ఒకటి మోహనరావు చేతికిచ్చాడు.

ఎవరో ఫాదిరీ వ్రాశాడు. ఆ నర్సు క్రిందటి వారంలో చనిపోతూ తన కన్ఫెషన్‌లో తను చేసిన తప్పు చెప్పుకొని, తను చనిపోయిన తర్వాత యీ విషయం అసలువారికి తెలియ పర్చమందనీ ఆ స్టేట్‌మెంట్ ప్రకారం పాత రికార్డులు పరీక్ష చెయ్యగా 12వ నెంబరు బెడ్ రాజ్యలక్ష్మమ్మగారి శిశువును 20వ నెంబరు బెడ్ కామేశ్వరమ్మగారికీ, ఆవిడకు పుట్టిన ఆడపిల్లను రాజ్యలక్ష్మమ్మగారికీ మార్చిందని తెలిస్తోందనీ వ్రాశాడు.

నదిలో ంచి కొట్టుకు పోయేవాడు సముద్రంలో పడ్డట్టయింది మోహన్రావుకి. తను రాఘవరావుగారి కొడుకా? జానకి నిజంగా రాఘవరావుగారి కూతురు కాదన్నమాట! అయితే యిప్పుడెట్లాగ! యిరవైయేళ్ళవుతోందే దగ్గర దగ్గర!

యింతట్లో కామేశ్వరమ్మగారు వచ్చింది. అసలు సంగతంతా చెప్పి నమ్మించే సరికి ఓ గంట సేపు పట్టింది. ఓ అరగంటసేపు తల్లీ కూతుళ్లూ, తండ్రీ కొడుకులు ఒకర్నొకరు చూస్తూ కూర్చోడంతో సరిపోయింది.

రాఘవరావే మళ్ళీ మొదలు పెట్టాడు. "కామమ్మగారూ! జరిగిపోయిం దేదో జరిగిపోయింది. మన ఖర్మ అలాగుంది. అంతే. మీరు ఎంతప్రయత్నించినా జానకిని కూతురుగా చూసుకోలేరు. నేను మోహన్రావునీ అంతే. ఇప్పుడు జానకిని మీకు అప్పచెప్తే ఏంకష్టాలు వస్తాయో నాకు తెలుసు. మీకూ మోహన్‌కి అభ్యంతరం లేకపోతే మీ జానకిని మా మోహన్‌కిచ్చి పెళ్ళి చెయ్యడం కంటె వేరే దారేమీ కన పడ్డలేదు. న్యాయంగా నా ఆస్తి మోహన్‌కి వస్తుంది గనుక వాళ్ళేమీ కష్టపడక్కర్లేదు. మీరూ నేనూ పెద్దవాళ్ళ మైపోయాం, యింక బతికినంత కాలం బతకం. రేపట్నించి మీరు కూడా యిక్కడే ఉండండి. అంతకంటె ఏం చెప్పగలను?" అన్నాడు రాఘవరావు.

* * *

"మోహన్!" వెళ్తూ ఉంటే గుమ్మందగ్గర మళ్ళీ నిలవేసింది జానకి.

"ఏం?"

"నే అడిగిన దానికి సమాధానం చెప్పు. ఇప్పుడు కూడా నన్ను పెళ్ళి చేసుకొంటావా?"

"ఆ! ఆ అనుమానం ఎందుకొచ్చిందీ?"

'నువ్వు కాస్తో కూస్తో డబ్బు తెస్తేనేగాని ఎవర్నీ పెళ్ళిచేసుకో నన్నావుగా మీ...కాదు మాఅమ్మతో? ఇప్పుడు మరి నాకు డబ్బు లేదుగా? ఎలా పెళ్ళి చేసుకొంటావ్!" అంది జాలిగా.

అందుకనేనా యిందాకా బయటికొచ్చాక చెప్తావా? అని అడిగింది. తనెంత భయపడ్డాడూ యిందాకా!

"ఓస్! యింతేనా! నే చెప్తున్నా విను జానకీ! ఏది ఎల్లా మారినా సరే నువ్వు రాఘవరావుగారి కూతురువే, నేను కామమ్మగారి అబ్బాయ్‌నే. తెలిసిందా?" అన్నాడు.

---

మొన్న ఇంగ్లండులో ఎన్నికల ప్రచారం తీవ్రంగా జరుగుతున్న రోజుల్లో—లేబరుపక్షం నిల్చున్న పార్లమెంటు అభ్యర్థి ఒకచోట ఉపన్యసిస్తూ, "లేబర్ ప్రభుత్వం దేశానికి ఎన్నో ఉపకారాలు చేసింది. పరిశ్రమల్ని జాతీయం చేసింది. మాతా శిశుసంరక్షణ పట్ల ఎక్కువడబ్బు ఖర్చు పెట్టింది. ఈనాడు దేశంలో పసిపిల్లలు యింత ఆరోగ్యంగా, బలంగా ఉన్నారంటే అందుకు కారణం—" అనేసరికి,

"పసిపిల్లల పరిశ్రమ జాతీయం కాకపోవడంవల్ల!" అని ఎవరో అరిచారు.